క్లుప్తంగా

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం



కూనాటి సురేష్‌ను సన్మానిస్తున్న నేతలు

శ్రీకాళహస్తి రూరల్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న శ్రీకాళహస్తి మండలం ఊరందూరు హైస్కూల్ ఉపాధ్యాయుడు కూనాటి సురేష్‌ను ఆదివారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథ ఆచారి ఘనంగా సత్కరించారు. ఆయన సాంఘిక శాస్త్ర బోధనలో ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చారని గుర్తు చేసుకున్నారు. ఆయన 20 ఏళ్లుగా అందిస్తున్న సేవలకు తగిన గుర్తింపు లభించిందన్నారు. కార్యక్రమంలో బొజ్జల బాబురెడ్డి, వజ్రం కిషోర్, చింతగింజల సునీల్, భాగ్యలక్ష్మి ఫర్నిచర్ యజమాని అమరావతి, సునీత తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి

ఏర్పేడు: యువత మత్తుకు దూరంగా ఉండాలని ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపారు. ఆయన శనివారం ఏర్పేడు పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. యువకులు గంజాయి తదితర మాదకద్రవ్యాలను విక్రయించడంతోపాటు వారు వినియోగిస్తున్నట్టు తమకు సమాచారం ఉందన్నారు. పోలీస్ స్టేషన్ నుంచి పాపానాయుడుపేట సుమారు 20 కిలోమీటర్ల దూరం ఉండటంతో అక్కడ జరిగే అక్రమాలపై దృష్టి సారించలేకపోతున్నట్లు వెల్లడించారు. సమస్యను తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు దృష్టికి తీసుకుని వెళ్లి పాపానాయుడుపేటలో అవుట్ పోస్ట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇసుక అక్రమ రవాణాకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఆకట్టుకున్న భజన



భజన చేస్తున్న కళాకారులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కళాకారులు వేసిన భజన ఆకట్టుకుంది. కళాకారులు చేతులకు, కాళ్లకు గజ్జలు కట్టి చేసిన కులుకు భజన చూపరులను ఆకట్టుకుంది. మహిళలు, పురుషులు, చిన్నపిల్లలు సైతం భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. భజన కళాకారులు ఆలపించిన భక్తిగీతాలు వినుసొంపుగా ఉన్నాయి.

గంధోత్సవం కరపత్రాల ఆవిష్కరణ

శ్రీకాళహస్తి: హజరత్ జూమ్లే షాపిర్ దర్గా గంధోత్సవ కరపత్రాలను ఆదివారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ నెల 26 నుంచి 29 వరకు జరిగే ఉరుసులో పాల్గొనాలని దర్గా ఉరుసు కమిటీ ప్రెసిడెంట్ ఓరుగంటి నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు గరికపాటి రమేష్ బాబు, గుమ్మల రాజేశ్వరరావు కన్వీనర్ జమ్రుద్ బాదుషా, మహమ్మద్ అన్సర్ దిలావర్ హుస్సేన్, దర్గా మసీద్ ఇమామ్ సాజిదులు ఖాదిరి, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షాకిర్ అలీ, దర్గా సభ్యులు రహీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో లోపించిన పారిశుద్ధ్యం



కొద్దిపాటి వర్షానికి నారాయణపురం గ్రామంలో బురదమయంగా మారిన వీధులు

శ్రీకాళహస్తి రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య లోపించడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. శ్రీకాళహస్తి పట్టణ సమీపంలోని నారాయణపురంలో వీధులు చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతున్నాయి. వీధుల్లో నీరు నిలుస్తుండడంతో దోమలు వృద్ధిచెందుతున్నాయి. కాలువల్లో చెత్త పేరుకుపోయి మురుగు ముందుకు కదలడం లేదు. పారిశుద్ధ్య పనులు చేయించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



శ్రీకాళహస్తి: మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న యువతరం సేవా సమితి సభ్యులు



శ్రీకాళహస్తి రూరల్ : వినాయకుడి పూజలో పాల్గొన్న వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి



శ్రీకాళహస్తి: హోమంలో పాల్గొన్న అంజూరు తారక శ్రీనివాసులు



సత్యవేడు గంగమిట్ట వీధిలో గణపతికి పూజలు చేస్తున్న భక్తులు




బుచ్చినాయుడుకండ్రిగలో ప్రసాదాలను పంపిణీ చేస్తున్న యువకులు



విఘ్న నాశకా.. వినాయకా..

- వాడవాడలా అంబరాన్నంటిన వినాయక చవితి వేడుకలు





శ్రీకాళహస్తి: అలంకార మండపంలో సిద్ధం చేసిన సారె, ఏర్పేడు : పాపానాయుడుపేటలో ఏర్పాటు చేసిన వినాయక స్వామి విగ్రహం



శ్రీకాళహస్తి: సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని నాలుగు మాడవీధుల్లో ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ నవసంధి వినాయకులకు శనివారం వినాయక చవితి పండుగ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ముక్కంటి సారె సమర్పించారు. సారెను ముందుగా ఆలయంలోని అలంకార మండపంలో స్వామి, అమ్మవారి వద్ద వుంచి విశేష పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా నాలుగు మాడ వీధుల్లోని నవసంధి వినాయకులకు సమర్పించారు. కార్యక్రమంలో కోలా ఆనందకుమార్, ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడి విగ్రహాల పంపిణీ

మట్టి వినాయకుడి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడుదామని యువతరం సేవా సమితి సభ్యులు కోరారు. వారు శనివారం ఎన్టీఆర్ పార్కు వద్ద ఉచితంగా మట్టి వినాయకుడి విగ్రాహాలతో పాటు తులసి మొక్కలు పంపిణీ చేశారు.

జ్ఞాన సిద్ధి వినాయక ఆలయంలో..

వినాయక చవితి సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణం గాంధీ వీధిలో ఉన్న జ్ఞానసిద్ధి వినాయకుడి ఆలయంలో శనివారం శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో హోమం, ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జలకం కిషోర్, కొల్లూరు హరినాథ్ నాయుడు, మొగరాల గణేష్, మధు, పూడి రవి, తిరుపాల్, కొల్లూరు జయ, కుప్పయ్య, సుబ్బయ్య, పత్తి జగన్నాథం, కిరణ్ సునీల్, హరి తదితరులు పాల్గొన్నారు

వినాయకుని దర్శించుకున్న ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

శ్రీకాళహస్తి రూరల్ : మండలంలోని టీఎంపీ కండ్రిగలో ఏర్పాటు చేసిన వినాయకుడిని ఆదివారం ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి దర్శించుకున్నారు. ప్రతి ఒక్కరికీ వినాయకుని ఆశీస్సులు ఉండాలని ప్రార్థించినట్టు తెలిపారు.

రేణిగుంటలో..

రేణిగుంట: మండలంలో వినాయక చవితి సంబరాలు వేడుకగా జరిగాయి. రేణిగుంట పట్టణంలోని ఆర్‌టీసీ బస్టాండ్ కూడలి వద్ద భారీ వినాయకుడి విగ్రహం ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపీటీసీ ధర్మరాజులు భక్తులకు అన్నదానం చేశారు. అలాగే జీఎం వీధిలో శ్రీ అభయ వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి సంబరాలు జరిగాయి. టి.మునికృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అలాగే పాంచాలి నగర్, జ్యోతినగర్, వేణుగోపాలపురం, వడ్డిమిట్ట తదితర ప్రాంతాల్లో గణనాథుని విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలందించారు.

కుర్రకాల్వలో కల్యాణోత్సవం

మండలంలోని కురక్రాలవ గ్రామంలో వెలసిన శ్రీ అభయ వరసిద్ది వినాయక స్వామి ఆలయంలో వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఆదివారం శ్రీ సిద్ధి, బుద్ధి సమేత వినాయకుడి కల్యాణం చేపట్టారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ఏకదంతాయ.. మనసాస్మరామి

సత్యవేడు: గణపతి నవరాత్రి మహోత్సవాలు శని, ఆదివారాలు వైభవంగా నిర్వహించారు. మండలంలో వాడవాడలా అలంకరించిన ప్రత్యేక పందిళ్లలో కొలువుదీరిన భారీ గణనాథుల విగ్రహాలకు విశేష పూజలు చేశారు. చెరుకు, వివిధ పండ్లు, ఉండ్రాళ్లు(కుడుములు), నైవేద్యాలతో పూజించారు. ఇళ్లలో పూజించిన గణనాథుని ప్రతిమలను దర్శించుకున్నారు. స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. స్వామివారి పూజలు చేసిన అక్షింతలు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: మండలంలో శనివారం వినాయక చవితి సంబరాలను ఘనంగా జరిగాయి. వినాయకుడి విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పలు గ్రామాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమం చేపట్టారు. వినాయక విగ్రహాలను ఊరేగించారు. కొన్ని గ్రామాల్లో 3, 5, 9 రోజులలు పూజలు చేసి విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: మండలంలో వినాయక చవితి వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించారు. సముదాయంలోని టీటీడీ అనుబంధ శక్తి వినాయక స్వామి ఆలయంలో ఉదయం అర్చకులు ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం వినాయకుడు సముదాయం వీధుల్లో విహరించారు. నారాయణవనం బస్టాండ్ సమీపంలో విఘ్నేశ్వరుడికి ఉదయం అభిషేకాలు, అన్న ప్రసాద వితరణ చేపట్టారు. రాత్రి ట్రాక్టర్‌పై సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించిన పూలప్రభపై వినాయకుడు అధిరోహించి నారాయణవనం వీధుల్లో విహరించారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: మండలవ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలు అంబరాన్నంటాయి. అన్ని గ్రామాల్లో విగ్రహాలను ప్రతిష్టించి పూజలు చేపట్టారు. ఆదివారం పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. త్రయంబకేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వరదయ్యపాళెం పురవీధుల్లో స్వామివారి ఉత్సవమూర్తిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. సోమవారం గణనాథున్ని నిమజ్జనం చేసేందుకు సిద్ధమయ్యారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలవ్యాప్తంగా గణేష్ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. భక్తి శ్రద్ధలతో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహాల వద్ద తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేసి గణనాథున్ని పుర వీధుల్లో ఊరేగించారు.

నాగలాపురంలో..

నాగలాపురం: నాగలాపురం సుమో స్టాండ్‌లో వినాయక చవితి వేడుకలు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండోరోజు సుమో స్టాండ్‌లో విగ్రహ మండపాన్ని అలంకరించారు. నాగలాపురం మండలం ఎస్ఎస్‌పురం వీఆర్‌ఓ మహేష్, వారి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.









శ్రీకాళహస్తి: సారెతో ఊరేగింపుగా వెళ్తున్న ఎమ్మెల్యే బొజ్జల, రేణిగుంట : కుర్రకాల్వలో గణనాథుని కల్యాణం, రేణిగుంట జీఎం వీధిలో భారీ వినాయకుడి వద్ద భక్తులు, బుచ్చినాయుడుకండ్రిగలో ...



నాగలాపురంలో..







వరదయ్యపాళెంలో విఘ్నేశ్వరుడి గ్రామోత్సవం, నారాయణవనం నవసంధులో, సముదాయంలో...,





సత్యవేడు పల్లాపువీధిలో పంచముఖ విఘ్నేశ్వరుడు, వరదయ్యపాళెంలో మట్టి వినాయకుడు



వరదయ్యపాళెం శాటిలైట్ కాలనీలో..

ఆస్పత్రి వద్ద అన్నదానం ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

శ్రీకాళహస్తి: ప్రభుత్వాస్పత్రికి వచ్చే పేద రోగుల సహాయకులకు అన్నదానం చేసే కార్యక్రమాన్ని ఎట్టకేలకు ఆదివారం ఎమ్మెల్యే సతీమణి రిషితా రెడ్డి ప్రారంభించారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి పట్టణానికి దూరంగా ఉంది. ఇక్కడికి వరదయ్యపాళెం, బుచ్చినాయుడుకండ్రిగ, నాయుడుపేట, పెళ్లకూరు, ఏర్పేడు, కేవీబీపురం మండలాల నుంచి అధిక సంఖ్యలో రోగులు వస్తుంటారు. వారు ఓపీ తీసుకుని వైద్యం చేయించుకునే సరికి మధ్యాహ్నం 2 గంటలు అవుతుంది. రోగులకు ఇచ్చే ఆహారం పరిమితంగా ఉండడంతో సహాయకులు ఇబ్బంది పడేవారు. ఏదైనా తినాలంటే కిలోమీటరుకు పైగా నడవాల్సి వచ్చేది. ఈ విషయాన్ని గుర్తించిన గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి చొరవతో శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేసేలా ఏర్పాట్లు చేశారు. రోజుకు సుమారు 150 మంది వరకు ఆలయంలో భోజనం చేసి ఆస్పత్రికి పంపించేవారు. ఎన్నికల సమయంలో ఆలయం నుంచి ఆస్పత్రికి భోజనం ఇవ్వకూడదని నిబంధన సాకుగా చూపి ఆపేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్నదానం కార్యక్రమం పునరుద్ధరణ చేయలేదు. దీంతో రోగుల సహాయకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంపై సాక్షి దినపత్రికలో రోగుల సహాయకుల ఆకలి కేకలు అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై సీపీఐ నాయకుడు మురళీ స్పందించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం ప్రారంభం కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీమణి రిషితారెడ్డి

ఎస్‌ఐగా రాజశేఖర్



నారాయణవనం: నారాయణవనం ఎస్‌ఐగా రాజశేఖర్ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఎన్నికల సందర్భంగా కర్నూలు జిల్లా నుంచి బదిలీపై వచ్చిన లక్ష్మీనారాయణ గత నెలలో సొంత జిల్లాకు వెళ్లిపోయారు. తిరుపతి వీఆర్‌లో ఉన్న రాజశేఖర్‌ను నారాయణవనానికి పంపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

కరాటేతో ఆత్మరక్షణ

శ్రీకాళహస్తి : కరాటే ఆత్మరక్షణ చేసుకోవచ్చని రూరల్ సీఐ రవినాయక్ తెలిపారు. పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో ఆదివారం కెనీషితో ర్యూ కరాటే డొ ఇండియా ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ ఫీడింగ్ ఈయామినేషన్ కార్యక్రమం నిర్వహించారు. రూరల్ సీఐ రవినాయక్, కరాటే కోచ్ ధనుష్, కమిటీ సభ్యులు సతీష్, సురేష్, గౌతమ్ పాల్గొన్నారు. అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలో గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించిన విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కరాటేలో బెల్ట్ ఫీడింగ్ కార్యక్రమం చాలా ముఖ్యమైనదని తెలిపారు. ఆత్మరక్షణ విద్య నేర్చుకుంటే విద్యార్థుల్లో చురుకుదనము, శారీరక దృఢత్వం పెరుగుతాయన్నారు. పిల్లలకు ఫోన్లు ఇవ్వకుండా ఇలాంటి క్రీడలను నేర్పించాలని సూచించారు.



కరాటే నేర్చుకున్న విద్యార్థులతో సీఐ రవినాయక్

సార్ .. ఇంటి స్థలాలు ఇస్తారా

- వరదయ్యపాళెంలో నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్న 450 మంది లబ్ధిదారులు
- పేదలకు ఇంటిస్థలం ఇచ్చేందుకు ప్రైవేటు స్థలం కొనుగోలు చేసిన గత ప్రభుత్వం
- రైతులకు రూ.2 కోట్ల పరిహారం కూడా పంపిణీ చేసిన వైనం
- నేటికీ పంపిణీకి నోచుకోని ఇళ్ల స్థలాలు



జగనన్న కాలనీ కోసం తలారివెట్టు సమీపంలో ప్రభుత్వం కొనుగోలు చేసిన స్థలం

వరదయ్యపాళెం: దేవుడు కరుణించినా పూజారి కరుణించలేదన్నట్లు వరదయ్యపాళెం మండల అధికారులు వ్యవహరిస్తున్నారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే సంకల్పంతో గత ప్రభుత్వం ఇళ్ల పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా వరదయ్యపాళెంలో ప్రభుత్వ భూమి లేని కారణంగా ప్రైవేటు రైతుల వద్ద భూసేకరణ ద్వారా భూములను కొనుగోలు చేసింది. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా అప్పటి ప్రభుత్వ లక్ష్యం నీరుగారింది. వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ, ఇందిరానగర్ గ్రామ పంచాయతీల పరిధిలో సొంతిల్లు లేని వారిలో 450 కుటుంబాలను రెవెన్యూ అధికారులు గుర్తించారు. వారికి ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు చేసేందుకు గత ప్రభుత్వంలో ఉత్తర్వులు జారీ చేశారు.

స్థల సమస్య..

వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూమి లేకపోవడంతో మండల కేంద్రానికి సమీపంలోని బుచ్చినాయుడుకండ్రిగ మండల పరిధిలో గల తలారివెట్టు వద్ద సర్వే నంబర్లు 130, 131, 135, 136, 136/2లలో గల 15.31 ఎకరాల ప్రైవేటు రైతుల భూమిని ఎకరా రూ.12.50 లక్షలు చొప్పున మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కొనుగోలు చేసింది. సంబంధిత రైతులకు రూ.1.91 కోట్ల పరిహారాన్ని కూడా అందజేసింది.



లేఅవుట్ ముఖచిత్రం

పంపిణీకి నోచుకోని పట్టాలు..

అయితే ఇంతవరకు బాగానే ఉన్నా రెవెన్యూ అధికారులు మాత్రం పట్టలా పంపిణీ గురించి పట్టించుకోలేదు. ముళ్ల చెట్లు తొలగించారు. అంతటితో ఆపేశారు. ప్రధానంగా వీధులు, ప్లాట్ల కేటాయింపులకు సంబంధించి హద్దు రాళ్ల నాటలేదు.

హౌసింగ్ అధికారుల నిర్లక్ష్యం..

ప్రధానంగా ఇళ్ల పట్టాల పంపిణీకి ముందే హౌసింగ్ అధికారులు లేఅవుట్‌ను అన్ని వసతులతో అభివృద్ధి చేయాలి. అయితే సంబంధిత అధికారులు ఆ దిశగా అడుగులు వేయలేదు. దీనిపై లబ్ధిదారులు సైతం ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి లేఅవుట్ అభివృద్ధితో పాటు త్వరితగతిన ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని కోరుతున్నారు.

అద్దె ఇంట్లో ఇబ్బంది పడుతున్నా..



నా పేరు ఈశ్వరి. నేను ఇందిరానగర్ పంచాయతీలోని పద్మావతిపురంలో అద్దె ఇంట్లో ఉన్నాను. పుట్టుకతో నేను ప్రత్యేక ప్రతిభావంతురాలిని. నేను ఒంటరిగా జీవనం సాగిస్తున్నా. నాకు నెలసరి వచ్చే రూ.4 వేల పింఛన్‌లో రూ.1500 అద్దెకే పోతుంది. మిగిలిన రూ.2500తో నెలంతా గడపాలి. తలారివెట్టు వద్ద నాకు ఇంటి స్థలం మంజూరు చేశారని గతంలో గ్రామ వలంటీర్ ద్వారా తెలుసుకున్నాను. నాలుగేళ్లుగా పట్టా నాకు అందలేదు.

– ఈశ్వరి, పద్మావతిపురం, ఇందిరానగర్ పంచాయతీ

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..



తలారివెట్టు వద్ద ఏర్పాటు కానున్న పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ లేఅవుట్ స్కెచ్ ప్రక్రియ పూర్తి చేశాం. క్షేత్రస్థాయిలో హద్దు రాళ్లు నాటాల్సి ఉంది. హౌసింగ్ వారు రోడ్ల అభివృద్ధి ప్రక్రియ పూర్తి చేస్తే తక్షణమే హద్దు రాళ్లను ప్లాట్ల వారీగా నాటిస్తాం. నేను తహసీల్దార్‌గా ఇటీవలే మండలంలో బాధ్యతలు స్వీకరించాను. పట్టాల పంపిణీ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సూచనలు పాటిస్తాం. ఇదివరకే అందిన దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారులను గుర్తిస్తాం.

– రాజశేఖర్, తహసీల్దార్, వరదయ్యపాళెం

పేకాటరాయుళ్ల అరెస్ట్

వరదయ్యపాళెం: మండలంలోని పులివల్లం గ్రామ సమీపంలో పేకాట స్థావరంపై ఎస్ఐ మల్లికార్జున, సిబ్బందితో కలసి శనివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.3,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

13 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ జయచంద్ర

ఏర్పేడు: రికార్డులులేని 13 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపారు. మండలంలోని వికృతమాల నీలాద్రి అపార్ట్‌మెంట్స్, టిడ్కో గృహాల వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఈ క్రమంలో లైసెన్స్‌లు, రికార్డులు సక్రమంగా లేని ద్విచక్ర వాహనాలపై కొందరు వెళుతున్నట్లు గుర్తించామన్నారు. రికార్డులు లేని 13 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రికార్డులు, లైసెన్స్‌లు లేకుండా ప్రయాణిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.